క్లుప్తంగా

నేడు జేవీకే కిట్ల పంపిణీ

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను అందించనున్నట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లను అందజేస్తారన్నారు.

మధ్యాహ్నం తవణంపల్లెలో..

తవణంపల్లె: తవణంపల్లె ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తామని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్.బాబు చేతుల మీదుగా కిట్లు అందజేస్తామని చెప్పారు.

నేడు నలగాంపల్లెలో గడప గడపకు..

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లె గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. నలగాంపల్లె, దళితవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అధికారులతో కలిసి పర్యటిస్తారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు.

సాహితీ అవార్డు కార్యక్రమం

చిత్తూరు రూరల్: నగరంలోని ప్రభాగాండ్‌ఇన్ హోటల్‌లో సోమవారం కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామలక్ష్మి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రచయితలు, సాహితీవేత్తలు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య

చిత్తూరు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హ్యూమన్ డెమోక్రటిక్ పార్టీ జిల్లా కార్యదర్శి శేఖర్ డిమాండ్ చేశారు. అలాగే రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు సైతం సర్కారీ బడుల్లో చదివితే తప్పనిసరిగా విద్యారంగంలో మార్పు వస్తుందని.. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



బంగారుపాళెం: మండలంలోని సదకుప్పం వద్ద శనివారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. అరగొండ నుంచి బంగారుపాళెం వైపు వస్తున్న కారు చెరువు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి రైతుల ఆందోళన



టి.పుత్తూరులో కాయలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

తవణంపల్లె: మామిడి కాయలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో మామిడి కిలో రూ.15 నుంచి ప్రారంభమై రూ.70 వరకు వ్యాపారులు, జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది పంట దిగుబడి తక్కువగా ఉన్నా మామిడి కాయలు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. ఫ్యాక్టరీ యజమానులు కిలో మామిడి రూ.10కి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని ఫ్యాక్టరీల్లో కాయలు నిల్వ చేయడానికి స్థలం లేదని ట్రాక్టర్ లోడ్లను తిప్పి పంపుతున్నారు. ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్ అవడంతో ధరలు పెరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి తోటల్లో కాయలకు మచ్చలు వచ్చి పంట దెబ్బతింటోందని వాపోతున్నారు. గిట్టు ధర కల్పించాలని కోరుతున్నారు.

దొంగ అరెస్టు

పెనుమూరు(అగ్రికల్చర్‌చిత్తూరు): చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్టు చేసినట్లు ఆదివారం పెనుమూరు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. గొడుగుమానుపల్లికి చెందిన చంద్రశేఖర్ శెట్టి, అతని కుమారుడు బాలాజీ ఈ నెల 1వ తేదీ ఇంటికి తాళాలు వేసుకుని బయటకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. అదే గ్రామానికి చెందిన భూపతి(20) పై బాధితులకు అనుమానం రావడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో ఈ దొంగతనం తానే చేసినట్లు నిందితుడు భూపతి ఒప్పుకున్నాడు. అతనితో పాటు ఓ మైనర్ బాలుడు కూడా ఉన్నాడని, ఇద్దరం కలిసి చంద్రశేఖర్‌శెట్టి ఇంటిలో 70 గ్రాముల బంగారం, 550 గ్రాములు వెండి వస్తువులను అపహరించినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అన్నదాతకు భరోసా

దుక్కు దున్ని..ఆరుగాలం శ్రమిస్తేనే రైతు కడుపు చల్లారుతుంది. ఆ రైతు వేసే ప్రతి గింజ మొలకెత్తి పది మందికి పట్టెడన్నం పెడుతోంది. అలాంటి కర్షకులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తూ..వ్యవసాయ రంగ అభివృద్ధికి వెన్నుతడుతోంది. పల్లె వాకిటకు రైతు సేవలను తీసుకొచ్చింది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సకల సదుపాయాలు కల్పిస్తోంది. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తోంది.

- రైతు భరోసా కేంద్రాల ద్వారా పల్లె వాకిటకు సేవలు
- అన్ని దశల్లోనూ రైతుకు చేయూత
- విత్తనం నుంచి విక్రయం వరకు అండ
- సాంకేతికత బదలాయింపులో కీలక పాత్ర
- ఫలితంగా వ్యవసాయ, పాడిపరిశ్రమ రంగంలో పురోగతి



భూసార పరీక్షలు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది



విత్తనాల కోసం క్యూలో వేచివున్న రైతులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో ఖరీఫ్‌కు 3,500 హెక్టార్లు, రబీలో 1250 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. అధికంగా వేరుశనగ, చెరుకు, వరి, కూరగాయాలు పండిస్తారు. 3 వేల హెక్టార్ల వరకు మామిడి సాగులో ఉంది. 7,250 మంది రైతులు ఈ రకమైన పంటలు సాగుచేస్తూ..బతుకు సాగిస్తున్నారు. అలాగే పాడిపరిశ్రమకు సంబంధించి పశువులు 18,887, గేదెలు 111, గొర్రెలు 4103, మేకలు 5782, నాటుకోళ్లు 4549, పెరటి కోళ్లు 11,217 ఉన్నాయి. వీటి ఆధారంగా 12,397 మంది జీవనోపాధి పొందుతున్నారు. వీరికి అండగా మండలంలో 9 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు నడుస్తున్నాయి.

రైతు భరోసా కేంద్రాల్లో సేవలు ఇలా

పల్లెకు రైతు భరోసా కేంద్రాలు వచ్చాక దుక్కు దున్నడం నుంచి పంట పండించే వరకు అండంగా ఉంటోంది. తొలుత భూసార పరీక్షలు చేయించి ఆ భూమిలో ఏరకమైన పంటలు పండించాలో వ్యవసాయశాఖ సిబ్బంది నిర్ధారిస్తున్నారు. నిర్ణీత సమయంలో రైతు ఖాతాకు పెట్టుబడి సాయం (రైతు బరోసా) జమ అవుతోంది. దుక్కులు దున్నేందుకు కావాల్సిన యంత్ర పరికరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ట్రాక్టర్లు, మడకలు, రోటావేటర్‌లు ఉన్నాయి. రాయితీతో డ్రిప్ పరికరాలు ఇస్తున్నారు. సీజన్‌ను బట్టి రైతుకు అవసరమైన వేరుశనగ, వరి, కందులు, పచ్చరొట్టె, అలసందలు, మొక్కజొన్నలు ఇలా పలు రకాల విత్తనాలను రాయితీ, ఉచితంగా కూడా ఇస్తోంది. హార్టికల్చర్‌లో భాగంగా పలురకాల పండ్ల తోటల పెంపకానికి అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. తర్వాత విత్తన శుద్ధి మందులను సరఫరా చేస్తోంది. పంట సాగులో అవసరమైన యూరియా, డీఏపీ, పొటాషియం, కాంప్లెక్స్, తెగుళ్ల నివారణకు కావాల్సిన మందులు కేంద్రాల్లోనే రైతులకు అందించేలా ప్రభుత్వం సదుపాయం కల్పించింది. ఏటా యూరియా 760 మెట్రిక్ టన్నులు, డీఏపీ 65 మెట్రిక్ టన్నులు, పొటాషియం 10.23 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 86 మెట్రిక్ టన్నుల వరకు మండలానికి కావాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఈ ఎరువుల కొనుగోలు కోసం రైతులు పొలం పనులు మానుకుని చిత్తూరు నగరానికి వెళ్లాల్సి ఉండేది. నగరంలో ఎరువులు ధరలు అధికంగా ఉందని, నాణ్యత లేదని తమిళనాడు బాట పట్టేవారు. తమిళనాడులో పొన్నై, పరదరామి, వేలూరు, కాట్పాడి తదితర ప్రాంతాలకు వెళ్లి ఎరువులు, పురుగు మందులు తెచ్చుకునేవారు. దీంతో రవాణా చార్జీలు రైతులకు భారంగా మారేవి. రైతు భరోసా కేంద్రాలు వచ్చాక బయట కొనుగోలుకు బ్రేకులు పడ్డాయి. కేంద్రాల్లో అందించే ఎరువులు, రసాయనిక మందులు నిర్ణీత ధర, నాణ్యతపరంగా బాగుండడంతో రైతులు వాటిని కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. రైతుకు అసరమైన భసార పరీక్ష చేయడం మొదలు..విత్తన శుద్ధి, పంట సాగు, తెగుళ్ల నివారణ, అధిగ దిగుబడికి కావాల్సిన సూచనలు, సలహాలు అందించేందుకు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. సాగైన పంటలకు ఈక్రాప్ బుకింగ్ చేయిస్తూ పంట నష్టపోతే నష్టపరిహరం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.

పాడి వృద్ధికి..

వ్యవసాయ రంగంతో పాటు పాడిపరిశ్రమ వృద్ధికి కూడా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక పశుసంవర్థక కార్యదర్శిని నియమించింది. వీరి ద్వారా పాడిపరిశ్రమను కాపాడుకుంటూ.. వృద్ధిరేటు, పాల ఉత్పత్తిని పెంచేలా చూస్తోంది. పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తం చేస్తూ ఉచితంగా నివారణ టీకాలు వేయిస్తోంది. పశుబీమా కల్పిస్తోంది. పురుగు మందులను ఉచితంగా అందిస్తోంది. రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.



మా ఊళ్లోనే విత్తనాలు ఇస్తున్నారు

మాకు రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వేరుశనగ, వరి, మిరప, ఆకుకూరలు, పశుగ్రాసం నాటుకుంటున్నాం. గతంలో అక్కడ.. ఇక్కడ వెళ్లి విత్తనాలు, ఎరువులు తెచ్చుకునే వాళ్లం. రైతు భరోసా కేంద్రం వచ్చాక మా ఊరిలోనే విత్తనాలు ఇస్తున్నారు. ఎరువులు కావాలంటే తెప్పిచ్చి ఇస్తున్నారు. సేవలు బాగున్నాయి.

– శైలజా, ముత్తుకూరు



ఇక్కడే దొరుకుతున్నాయి

నేను ఎంబీఏ పూర్తి చేశాను. కొన్నాళ్లు ప్రైవేటు ఉద్యోగం చేశా. వద్దనుకుని వ్యవసాయం చేస్తున్నా. 15 ఎకరాల్లో మామిడి ఉంది. 3 ఎకరాల్లో వేరుశనగ వేస్తాం. ఈ అవసరాలకు కావాల్సిన విత్తనాలు ఆర్బీకేలోనే దొరుకుతున్నాయి. ముఖ్యంగా ఎరువులు కావాలంటే తమిళనాడు వెళ్లి తెచ్చుకునేవాళ్లం. మా ఊరికి ఆర్బీకే వచ్చాక ఇక్కడే ఎరువులు, పురుగుల మందులు దొరుకుతున్నాయి. తెగుళ్లు వస్తే అధికారులే తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– అరుణ్‌కుమార్, తుమ్మింద

నేడు స్పందన

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్‌లలోని వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందజేయవచ్చన్నారు. ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్ 98499 07885కు సైతం సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు.

గణనాథుని సేవలో తిరుపతి జేసీ



బాలాజీ దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఐరాల తహసీల్దార్ సుశీల ఉన్నారు.

క్రికెట్ విజేత బంగారుపాళెం



లయన్‌బాయ్స్ జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో బంగారుపాళ్యానికి చెందిన లయన్ బాయ్స్ జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. 20 రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయన్నారు. ఫైనల్‌లో క్రిక్ మీట్స్ జట్టుపై లయన్ బాయ్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.10 వేల నగదును జయప్రకాష్‌నాయుడు, కమలనాథరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కౌశిక్, సురేంద్రనాయుడు, శ్రీనివాసులునాయుడు, హేమచంద్ర పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ జె.అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఎస్బీ కాలనీ, వెంగళరావు కాలనీలోని పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు- నేడు పనులను కమిషనర్ ఆదివారం తనిఖీ చేశారు. ఎస్బీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్లు, ఎలక్ట్రిఫికేషన్, ఇతర చిన్నపాటి రిపేరు పనులను పరిశీలించారు. నాడు-నేడు పనులన్నీ దాదాపు పూర్తి కావచ్చాయని, వాష్ బేసిన్ పనులు సాయంత్రానికి పూర్తి చేయిస్తామని ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. పాఠశాలలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నందున అన్ని పనులు ఆదివారం సాయంత్రానికి పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతగా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు, పాఠశాల హెచ్‌ఎం పర్యవేక్షించాలన్నారు. అనంతరం కమిషనర్ వెంగళరావు కాలనీలోని షణ్ముగానంద స్కూల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎంఈ వెంకట ప్రసాద్, డీఈ రమణ, పాఠశాల హెచ్‌ఎంలు, ఏఈలు ఉన్నారు.

ఎమ్మెల్యేని అడ్డుకోవడం దారుణం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బంగారుపాళెం: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబును టీడీపీ నేతలు అడ్డుకోవడం దారుణమని మొగిలివారిపల్లె మాజీ సర్పంచ్ దొరస్వామి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యేను దూషించడం సరికాదన్నారు. మొగిలివారిపల్లెలో బాలసుబ్రమణ్యంనాయుడు కుటుంబ సభ్యుల భూమిని ఎమ్మెల్యే జగనన్న కాలనీకి దౌర్జన్యంగా లాక్కున్నారని, ఎమ్మెల్యేని కులం పేరుతో దూషించలేదని టీడీపీ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి సవాల్ విసరడం విడ్డూరంగా ఉందన్నారు. 1976లో బాలసుబ్రమణ్యంనాయుడు తన భూమిని ప్రభుత్వానికి రాసి ఇచ్చిన మాట నిజం కాదా, తరువాత రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిలో మామిడి చెట్లు నాటి కోర్టుకు వెళ్లడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 1985లో దళితుల ఇళ్లకు ఆ భూమిని కేటాయించిన విషయం నిజం కాదా అన్నారు. దళితులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లోకి రానీయకుండా 45 ఏళ్లుగా దౌర్జన్యం చేసి అడ్డుకుంది మీరు కాదా అని పేర్కొన్నారు. మాజీ ఉపసర్పంచ్ హేమగిరి, నాయకులు నంద, గాంధీ, రవీంద్ర ఉన్నారు.

సాయుధ దళ ఆత్మీయ సమావేశం



చిత్తూరు అర్బన్: పోలీసు శాఖ సాయుధ దళ 1990 బ్యాచ్ తృతీయ ఆత్మీయ సమావేశం ఆదివారం చిత్తూరులో జరిగింది. ఒకరినొకరు పలకరించుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా సాయుధ దళ ఏఆర్ ఎస్‌ఐ కరుణాకరన్(కంద)ను సహచర పోలీసులు ఘనంగా సన్మానించారు. కంద నిర్వహిస్తున్న సంతపేటలోని మాతృసేవా అన్నదాన ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేశారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే



ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏనుగుండ్లపల్లిలో దారి తగాద

చిత్తూరు రూరల్: మండలంలోని ఏనుగుండ్లపల్లిలో ఆదివారం ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామంలో రెండేళ్లుగా దారి సమస్య ఉంది. ఆదివారం దారి కోసం రెండు వర్గాలు గొడవపడ్డాయి. ఒక వర్గం ఈ దారిలో వెళ్లకూడదని అడ్డుపడింది. మరో వర్గం దారి వదలకపోతే కుదరదంటూ ధీటుగా నిలబడింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఒకరిపై ఒకరు కర్రలు, ఇనుప రాడ్‌లతో కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సోమవారం ఇరువర్గాలపై కేసు నమోదు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

విరివిగా రుణాలు



మహిళా సమాఖ్య సమావేశంలో సంఘ మిత్రలు

గుడిపాల: మండల సమాఖ్య ద్వారా మహిళా సంఘం సభ్యులకు విరివిగా రుణాలను అందజేయనున్నట్లు సమాఖ్య అధ్యక్షురాలు ప్రతిమ అన్నారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఈశ్వరి అధ్యక్షతన సంఘమిత్రల సమావేశం నిర్వహించారు. మండల సమాఖ్య నిధి నుంచి బయోమెట్రిక్ ద్వారా ప్రతి మహిళా సభ్యురాలికి రుణాలు ఇస్తామన్నారు. అలాగే స్త్రీనిధితో పాటు జగనన్న ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రూ.35 వేలు వడ్డీ లేకుండా ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారునికి వైఎస్సార్ బీమా చేయించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పొలంలో గుర్తు తెలియని మృతదేహం

చిత్తూరు అర్బన్: చిత్తూరు కట్టమంచి రెడ్డిఅండ్ రెడ్డి కాలనీలోని వ్యవసాయ పొలంలో ఆదివారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. మృతదేహం కుళ్లిపోయి.. దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి 45 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, మృతుడి వివరాలు తెలిస్తే 9440796705, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ భాస్కర్ పేర్కొన్నారు.

కంటి ఆపరేషన్లకు 16 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 16 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, దివంగత ఎంపీ చెంగల్‌రాయ నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు 61 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 16 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, మాజీ సర్పంచ్ కమలనాథరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ



మట్టికోసం ఎగబడుతున్న జనం

చిత్తూరు రూరల్: నగర పరిధిలోని బండపల్లిలో ఆదివారంతో మహాభారతయజ్ఞ మహోత్సవం ముగిసింది. మహోత్సవంలో చివరి ఘట్టమైన దుర్యోధన వధను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు.

ఈ సన్నివేశాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి జనం తరలివచ్చారు. వధ అనంతరం మట్టి కోసం ఎగబడ్డారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గ్రంథాలయ అధికారి

యాదమరి: గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. పలు అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి ఆదివారం ఉదయం యాదమరి గ్రంథాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మధుబాబు, ఉప సర్పంచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు

చిత్తూరు రూరల్: దళితుల సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర యువత అధ్యక్షుడు సుధాకర్, జిల్లా యువత అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. దళితుల భూ ఆక్రమణలపై రెవెన్యూలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సభ్యులు కిరణ్‌కుమార్, శివలింగం, నరేంద్ర, హరీష్, రాజ, చంద్ర పాల్గొన్నారు.